# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 29-01-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ అమరవీరుల దినోత్సవం సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను గుర్తు చేసుకుందామని గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ పిలుపునిచ్చారు.
- ❖ రాష్ట్రంలో చేపట్టిన జాతీయ రహదారుల ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆయన క్యాంప్ కార్యాలయంలో ఈరోజు సమీక్ష నిర్వహించారు.
- ❖ ఆంధ్రప్రదేశ్ తూర్పు తీరాన్ని అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా మార్చడమే ప్రభుత్వ సంకల్పమని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు.
- ❖ చేనేత కార్మికులకు ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఉచిత విద్యుత్ పథకం అమలు చేయనున్నామని మంత్రి ఎస్.సవిత తెలిపారు.

====================

జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని ఏటా జనవరి 30న జరుపుకునే ‘అమరవీరుల దినోత్సవం’ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ఒక సందేశం విడుదల చేశారు. మహాత్మా గాంధీకి వినయపూర్వక నివాళులు అర్పిస్తున్నానని ఆ సందేశంలో పేర్కొన్నారు. సహాయ నిరాకరణ ఉద్యమం, క్విట్ ఇండియా, ఉప్పు సత్యాగ్రహం వంటి అనేక చారిత్రాత్మక ఉద్యమాలకు మహాత్మా గాంధీ నాయకత్వం వహించి బ్రిటిష్ పాలన నుండి విముక్తి పొందేందుకు భారత స్వాతంత్ర్య ఉద్యమానికి గాంధీజీ అందించిన సహకారాన్ని మాటల్లో కొలవలేమన్నారు. గాంధీజీ విధానాలు అహింసాయుతమైనవని దేశంలోని అనేక మందికి అవి స్ఫూర్తిదాయకమన్నారు. ‘అమరవీరుల దినోత్సవం’ సందర్భంగా, మహాత్మా గాంధీతో పాటూ ఇతర స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను గుర్తు చేసుకుందామని, సాహసోపేతమైన అమరవీరులకు నివాళులు అర్పిద్దామని గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ పిలుపునిచ్చారు.

====================

రాష్ట్రంలో చేపట్టిన జాతీయ రహదారుల ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆయన క్యాంప్ కార్యాలయంలో ఈరోజు సమీక్ష నిర్వహించారు. జాతీయ రహదారుల నెట్‌వర్క్ విస్తరణ, రాష్ట్ర రహదారులు, రోడ్ డెన్సిటీ

పెంపు తదితర అంశాలపై ఈ సందర్భంగా చర్చించారు. ప్రస్తుతం రాష్ట్రంలో చేపట్టిన జాతీయ రహదారి ప్రాజెక్టుల పురోగతి, కొత్త రహదారుల నిర్మాణం తదితర వివరాలను ముఖ్యమంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం 2 వరుసలుగా ఉన్న జాతీయ రహదారులను 4 వరుసలకు మార్చేందుకు ప్రణాళికలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ సమీక్షా సమావేశానికి రహదారులు, భవనాల శాఖ మంత్రి బీ సీ జనార్ధన్ రెడ్డి, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, జాతీయ రహదారుల సంస్థ అధికారులు హాజరయ్యారు.

====================

అల్లూరి సీతారామరాజు జిల్లాలో "అరకు ఉత్సవాలు" ఈరోజు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ అరకు ఉత్సవ్-2026ను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖా మంత్రి కందుల దుర్గేష్, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు స్టాళ్లను మంత్రులు పరిశీలించారు. అనంతరం కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించారు. ఈ సందర్భంగా లంబసింగిలో టెంట్ సిటీ, పోలవరం జిల్లా మారేడుమిల్లిలో హోమ్ స్టేల ఏర్పాటు తదితర పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడంతో పాటు, స్థానిక కళాకారులను మంత్రులు సన్మానించారు. అనంతరం మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ... అరకు ఉత్సవ్ మన సంస్కృతిని కాపాడుతూనే మన ప్రాంత అభివృద్ధికి బాటలు వేస్తుందన్నారు. ప్రతి కుటుంబంలో ఒకరికి పర్యాటక రంగంలో ఉపాధి కల్పించడమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్ తూర్పు తీరాన్ని అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా మార్చడమే ప్రభుత్వ సంకల్పమని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

====================

చేనేత కార్మికులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఉచిత విద్యుత్ పథకం అమలు చేయనున్నామని రాష్ట్ర చేనేత, జౌళి శాఖా మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి మగ్గాలకు 200 యూనిట్లు, మర మగ్గాలకు 500 యూనిట్లను ఉచితంగా అందజేయనున్నట్లు వెల్లడించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఈరోజు నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ... నేతన్నలకు 365 రోజుల పాటు ఉపాధి కల్పించేందుకు కీలక ఒప్పందాలు చేసుకుంటున్నామని తెలిపారు. కో-ఆప్టెక్స్, టాటా తనేరియా, బిర్లా ఆద్యం సంస్థలతో ఒప్పందాలు చేసుకున్నామన్నారు. ఈ ఉచిత విద్యుత్ పథకంతో మగ్గం వాడే నేతన్నలకు ఏడాదికి 8 వేల 640 రూపాయలు ఆదా అవుతుందని మంత్రి ఎస్.సవిత వెల్లడిస్తూ....

(వాయిస్ 28 సెకన్లు)

విరామం

====================

అనకాపల్లి ఉత్సవాలు రేపటి నుండి రెండు రోజుల పాటూ జరగనున్నాయి. జిల్లాలో తొలిసారిగా నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలను ఉత్తరాంధ్ర సంస్కృతి, వైభవం చాటేలా నిర్వహించాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అధికారులను ఆదేశించారు. అనకాపల్లి ఉత్సవాలలో భాగంగా ప్రధాన వేదిక, ఎన్.టి.ఆర్. స్టేడియంలో ఏర్పాట్లను ఈరోజు కలెక్టర్ విజయకృష్ణన్ తో కలిసి మంత్రి పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ... ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు విశాఖ ఉత్సవాలతో పాటు.. అనకాపల్లి, అరకు ఉత్సవాలు కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇప్పటికే విశాఖ ఉత్సవం ప్రారంభమైందని, అనకాపల్లి జిల్లాలో నాలుగు చోట్ల వివిధ కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కొండకర్ల ఆవ, ముత్యాలమ్మపాలెం బీచ్, అనకాపల్లి బెల్లం మార్కెట్, ఎన్.టి.ఆర్. స్టేడియంలలో ఉత్తరాంధ్ర, సంస్కృతి సాంప్రదాయాన్ని ప్రతిబింబించేలా కార్యక్రమాలు జరుగనున్నాయని మంత్రి చెప్పారు.

====================

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపి, జిల్లాను వివాదరహితంగా మార్చడమే తమ ప్రధాన లక్ష్యమని విజయనగరం జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి స్పష్టం చేశారు. భూముల రీ-సర్వే ప్రక్రియలో దొర్లిన పొరపాట్లను సరిదిద్ది, రైతులకు భరోసా కల్పించేందుకు చేపట్టిన ప్రత్యేక కార్యాచరణలో భాగంగా ఈరోజు బొబ్బిలి కళా భారతిలో రెవెన్యూ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గతంలో జరిగిన సర్వే లోపాల వల్ల రైతులు పడుతున్న ఇబ్బందులను పరిగణనలోకి తీసుకొని ఈసారి అత్యంత పారదర్శకంగా రికార్డులను ప్రక్షాళన చేయాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా మొదటి, రెండు దశల్లో ఇప్పటికే 499 గ్రామాల్లో రీ-సర్వే పూర్తై పోర్టింగ్ జరిగిన 423 గ్రామాల్లో 2 లక్షల 3 వేల పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేయాల్సి ఉందన్నారు. ఈ గ్రామాలకు చెందిన పాస్ పుస్తకాల్లో పెద్ద ఎత్తున తప్పులు చోటు చేసుకున్నాయని చెప్పారు. రికార్డుల్లో తప్పులన్నిటినీ సరిదిద్దాల్సిన గురుతర బాధ్యత ప్రస్తుతం రెవెన్యూ అధికారులపై ఉందన్నారు. జిల్లాలో చాలా భూ సమస్యలకు కారణమైన జాయింట్ ఎల్పీఎంలను సరిదిద్దాలని కలెక్టర్ ఆదేశించారు.

====================

పామ్ ఆయిల్ రైతులకు లాభదాయక ధరలను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. గుంటూరు జిల్లా వడ్డేశ్వరంలోని ప్రైమ్ హిల్ క్రెస్ట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ డైరెక్టర్ నూతన కార్యాలయ భవనాన్ని మంత్రి ఈరోజు ప్రారంభించారు. అనంతరం, ఆయిల్ పామ్ ధరల నిర్ధారణ (Fixation) కమిటీ సమావేశానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం, ఉత్పత్తి, ఉత్పాదకతలో దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని చెప్పారు. రైతుల ఆదాయం పెంపే లక్ష్యంగా పని చేస్తున్నామని.. ఉద్యాన, పామ్ ఆయిల్ రంగంలో సంస్కరణలు తీసుకువస్తున్నామని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ నూనె గింజల మిషన్ ద్వారా ఉచిత మొక్కలు, సాగు ప్రోత్సాహకాలు, అంతర పంటలకు సహాయం, బిందు సేద్యం పరికరాలపై రాయితీలు అందిస్తున్నామని, ఎన్డీఏ కూటమి ప్రభుత్వ లక్ష్యసాధక నిర్ణయాలతో ఆయిల్ పామ్ రాష్ట్ర రైతులకు స్థిరమైన, లాభదాయక ఆదాయ పంటగా మారుతోందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

====================

విశాఖపట్టణంలో పర్యటిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఈరోజు నగరంలోని ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలను సందర్శించారు. జూ పార్క్‌లోని రెండు జిరాఫీలను ఏడాది పాటు దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటించారు. జూ పార్కులో నూతనంగా నిర్మించిన ఎలుగుబంట్ల ఎన్‌క్లోజర్‌ను ఆయన ప్రారంభించారు. జూ పార్కులోని నీటి ఏనుగులు, నల్ల ఎలుగుబంట్లు, పులులు, సింహాల ఎన్‌క్లోజర్ల వద్దకు వెళ్లి వాటికి ఆహారం అందించారు. కంబాలకొండ ఎకో పార్కులో నగరవనాన్ని కూడా ప్రారంభించారు. అక్కడ పెరుగుతున్న మొక్కల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. జంతు సంరక్షణకు కార్పొరేట్ సంస్థలు ముందుకు రావాలని ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు.

====================
====================